అన్వేషణ!

అజీజ్

"ఇక్కడ ఆపు నాయనా!" అంది కౌసల్యాదేవి రిక్షా వాడితో.

ఆమె చెప్పినచోట రిక్షా ఆగింది.

కౌసల్యాదేవి దిగకుండా, కళ్ళజోడు సరిజేసుకుంటూ తలెత్తి గేటుమీది బోర్డువైపు చూసింది. 'సరస్వతీ ప్రైమరీ స్కూల్.'

ఆఁ, తన గమ్యం ఇదే, అనుకుంటూ తృప్తిగా రిక్షా దిగింది.

సీటుమీది చిన్న మూటా, చేతిసంచీ అందుకుని, రిక్షా వాడి చేతిలో రూపాయి నోటుపెట్టి స్కూలు భవనం వైపు అడుగులు వేసింది.

ఏభైఏళ్ళు దాటిన ప్రౌఢ. పసిమి ఛాయ. మెడకిందా, నుదుటిమీదా వయసూ, అనుభవాలూ వేసిన ముడతలు. ఒకసారి కన్నెత్తి చూసినవారికి ఆమె వదనంలో సన్యాసి నులకుండే ఏదో అనూహ్యమైన దివ్యతేజస్సు ద్యోతక మౌతుంది. తెల్లని నేతచీరా, రవికా, మెడలో రుద్రాక్ష మాలా వేసుకున్న ఆమె చూపరులకి నిజంగా సన్యాసి నేమో అన్న భ్రాంతి కలిగిస్తుంది.

కాని, ఆమె సన్యాసిని కాదు. సన్యాసినులకి తనదీ, తనవాళ్ళూ అన్న ఆపేక్షలూ, ఐహిక బంధాలూ, మమకా రాలూ ఉండవు. మోహపాశాలకీ, కలతలకీ కార్పణ్యా లకీ అతీతంగా ఉంటాయి వారి మనసులు.

ఆధ్యాత్మిక చింతనతో, మోక్షానికి మెట్లు వేసుకోవా లని ఇల్లూ, వాకిలి వదిలి, కన్న కూతుర్ని పరాయివాళ్ళ చేతుల్లో పెట్టి తెగిన గాలిపటంలా ఎక్కడెక్కడో ఉన్న పుణ్యతీర్థాలు సేవిస్తూ వాటిలో ఈశ్వరుణ్ణి అన్వేషిస్తూ తిరిగి తిరిగి హఠాత్తుగా కూతురివైపు మనసుమళ్ళి, మమతానురాగాలు పొంగులువారి, కన్నకూతుర్ని చూడా లన్న కాంక్షతో ఉరుకూ పరుగులతో వచ్చిన కౌసల్యా దేవి సన్యాసిని ఎలా అవుతుంది?

పదహారు నెలలు!

ఈ పదహారు నెలలు తన చిట్టితల్లిలో ఎన్ని మార్పులు తెచ్చాయో? ఇంకా చిట్టితల్లి ఏమిటీ? ఇప్పుడు పవిత్రకి ఇరవై రెండేళ్ళు నిండి ఉంటాయి. బహుశా, ఇరవై మూడులో ప్రవేశించి ఉంటుంది. ఆడపిల్లల్లో ప్రతివారం ఏదో ఒక మార్పు కనిపిస్తూనే ఉంటుంది మరి!

పవిత్ర ఎంతమారినా తను చిటికెలో గుర్తుపట్టగలదు.

కన్నకళ్ళు కదా? పవిత్రకూడా తనని లిప్తపాటులో పోల్చుకుంటుంది. ఆనందం పట్టలేక పరిగెత్తుకు వస్తుంది. తనని అల్లుకుపోయి ఉక్కిరి బిక్కిరిచేస్తూ గారాలు పోతుంది.

ఆలోచిస్తూ స్కూలు కాంపౌండ్ గేటు తోసుకుని లోనికి నడిచింది కౌసల్యాదేవి. చాలా చిన్న కాంపౌండు. కాంపౌండ్ నాలుగువైపులా కట్టిన క్లాసు గదులు క్లాసుల్లో పసివాళ్ళేదో తెలుగు పద్యాన్ని ముక్తకంఠంతో పెద్దగా ఆలాపిస్తున్నారు. చేతిలో సన్నని బెత్తం పట్టుకుని అప్పుడే ఓ క్లాసులోంచి వరండాలోకి వచ్చిన ఓ స్త్రీ కౌసల్యాదేవిని చూసి–"ఎవరండీ? ఏం కావాలి?" అంది.

"సుభద్రమ్మగారికోసం వచ్చేనమ్మా! వారు ఉన్నారా?"

"ఇంతక్రితమే రిక్షాలో బైటికెళ్ళారు. ఎప్పుడొస్తారో చెప్పలేను."

కౌసల్యాదేవి కళ్ళు పవిత్ర కనిపిస్తుందేమోనని క్లాసు గదులవైపు పారి, నిరాశతో తిరిగి ఆమెవైపు మళ్ళాయి. "ఆవిడ వచ్చేవరకూ నేనిక్కడ ఎదురు చూడవచ్చా?" అడిగింది నీరసంగా.

ఆ స్త్రీ తలూపి, "రండి!" అంటూ వరండా మెట్లు దిగింది.

ఆమెని అనుసరిస్తూ కుడిపక్క క్లాసుల చివర ఉన్న గదివైపు నడిచింది కౌసల్యాదేవి.

ఆ గది ద్వారానికి "హెడ్ మిస్ట్రెస్" అనే నేమ్ ప్లేట్ తగిలించి ఉంది.

ఆమె కౌసల్యాదేవిని లోనికి తీసికెళ్ళి–"ఇది సుభద్రమ్మ

గారి ఆఫీసు. ఆమె వచ్చేవరకూ ఇక్కడ కూర్చోండి" అంది.

కౌసల్యాదేవి చిన్నగా నవ్వుకుంది. ఈమె ఎవ్వరో గానీ తనకేం తెలీనట్టే మాట్లాడుతోంది. ఏణ్ణర్థం క్రితం తను చూసినప్పుడు ఈమె ఇక్కడ లేదు. ఈమధ్యే కొత్తగా చేరి ఉంటుంది.

తనకి సుపరిచితమైన ఆఫీసు ఇది. కాని, అప్పటికీ, ఇప్పటికీ ఏదో మార్పు కనిపిస్తోంది.

గదిలో ఉన్న ఫర్నిచరూ, వస్తువులూ, గోడలకి వేళాడుతున్న పటాలూ, తలుపుకీ, కిటికీలకీ వేళాడుతున్న పరదాలూ ఉత్తమ అభిరుచినేగాక, సంపన్నతని కూడా చాటుతున్నాయి. దీన్నిబట్టి సుభద్రమ్మ స్కూలు మును పటికంటే బాగానే నడుస్తోందని తెలుస్తోంది. ఆమెతో బాటు పవిత్రకూడా సుఖంగా ఉండి ఉంటుంది మరి.

అనుకుంటూ చంకలోవున్న మూటా, చేతిలోని సంచీ కింద పెట్టి కుర్చీలో కూర్చుంది కౌసల్యాదేవి. వెళ్ళబోతున్న ఆ స్త్రీని ఆపి—"చూడమ్మా! నేను సుభద్రమ్మనుకాదు, పవిత్రనికూడా చూడాలి. కాస్త ఆ అమ్మాయిని పిలు స్తావూ?" అంది.

ఆమె కనుబొమలు ముడిచి అర్థంకానట్టు చూసింది. "పవిత్రా? స్కూల్లో కొత్తగా చేరిందా? ఏ క్లాసు?"

ఊహించని ఆ ప్రశ్నతో కౌసల్యాదేవి కాసేపు అవాక్కయిపోయింది. "పవిత్ర స్కూల్లో చదివే పసి పిల్ల కాదమ్మా! పిల్లలకి పాఠాలు చెప్పే పాతికేళ్ళ యువతి. నీవూ ఇక్కడ పనిచేస్తున్నట్టున్నావుగా? పవిత్రని ఎరగవా?"

ఆ స్త్రీ మొదటిసారి నవ్వి-"బహుశా, ఆ పేరుగల టీచర్ ఒకప్పుడు పనిచేసేదేమో! నాకు తెలిసినంత మటుకూ ఆ పేరుగల పంతులమ్మెవరూ లేరిక్కడ!" అంది.

"నీవు ఎన్నాళ్ళనించి పనిచేస్తున్నావిక్కడ?" అడిగింది కౌసల్యాదేవి ఆశ్చర్యంగా.

"ఆరు నెలలవుతోంది!"

"అంటే, ఆరు నెలలనించీ పవిత్ర ఇక్కడ లేదా?" విభ్రాంతితో అడిగింది కౌసల్యాదేవి.

"ఆ పేరు ఇప్పుడే కొత్తగా వింటున్నాను!"

కౌసల్యాదేవి గుండె గతి వేగం అందుకుంది. ఏమిటీ విచిత్రం! ఏణ్ణర్థం క్రితం తను వెళ్ళేటప్పుడు సుభద్రమ్మ పవిత్ర తల నిమురుతూ స్వయంగా చెప్పింది.

"కొత్తగా కొన్ని క్లాసులు ప్రారంభించబోతున్నాను. అందులో పవిత్రకి అవకాశం కల్పించాలని వుంది. అటు తన చదువూ చూసుకుంటూ, ఇటు నా పర్యవేక్షణలో మంచి ఉపాధ్యాయినిగానూ శిక్షణ పొందుతుంది"అని.

ఓహో! సుభద్ర ఆ కొత్త క్లాసులు ప్రారంభించే సంకల్పం మానుకుందేమో, అందుకే పవిత్ర ఇక్కడ పని చెయ్యడంలేదు కామోను. ఆ కారణంగా ఈమెకి పవిత్ర గురించి తెలీదు.

స్కూలు వెనక భాగంలోనే సుభద్రమ్మ అందమైన ఒంటంతస్తు ఇల్లుంది. అందులోనే ఆవిడతో పవిత్ర వుంటోంది. ఆ పిల్లకి కలుపుగోలుతనం తక్కువ. తన పనేమిటో, తనేమిటో ఈమెకి పవిత్రగురించి తెలియకపోడానికి అదీ ఓ కారణమే మరి! అనవసరంగా భయపడ్డాను.

అనుకుంటూ తలెత్తి_"చూడమ్మా! నీవు కొత్తకదా, ఆ విషయాలేవీ నీకు తెలీవు. ఎవరైనా పాత వుపాధ్యాయిని వుంటే పంపించు. ఆమెనడిగి కనుక్కుంటాను" అంది కౌసల్యాదేవి.

"సరే, పార్వతిని పంపిస్తానుండండి" అంటూ నడిచిందా స్త్రీ.

కౌసల్యాదేవికి ఆలోచనలన్నీ కూతురుచుట్టే భ్రమిస్తున్నాయి. ఆ నాలుగు గోడలమధ్య ఒంటరిగా కూర్చున్న ఆమె మస్తిష్కం గతాన్ని సినిమా రీలులా గిరగిర తిప్ప సాగింది వెనక్కి.

ఆరేళ్ళక్రితం తను సూర్యాపేటలోని గర్ల్స హైస్కూల్లో టీచరుగా పనిచేసేది. అప్పుడు సుభద్రమ్మ ఆ స్కూలుకే ప్రధానోపాధ్యాయిని. ఇద్దరూ అదేస్కూలు నించి కాస్త వెనకా ముందు రిటైరయ్యారు. అప్పటికే తను భర్తృహీన!

సుభద్రమ్మ వాళ్ళ స్వస్థలం హైద్రాబాదే. రిటైరయ్యాక ఆమె ఇక్కడికి వచ్చి, ఈ కాంపౌండూ అదీ కొని, స్కూలు ప్రారంభించింది. విధివశాత్తూ ఆ మరుసటి ఏడే ఆమె భర్త పోయేడు. సంతానంలేని సుభద్రమ్మ తన దగ్గిర చేరే పిల్లల్నే కన్నవాళ్ళుగా, ఆప్యాయంగా చూసుకుంటుంది.

రిటైరయ్యాక తను పవిత్రతో తన స్వస్థలం అనంతపూర్ వెళ్ళిపోయింది. అక్కడే, ఓ స్వంత పెంకుటిల్లూ, మూడికరాల మాగాణీ వున్నాయి. పవిత్ర ఒక్కతే సంతానం తనకి. కడుపులో పెట్టుకు పెంచింది.

స్వస్థలం చేరే సమయానికి పవిత్ర_మొదట సంవత్సరం

ఇంటర్ పాసయ్యింది, సూర్యాపేటలోనే. అనంతపూర్ వెళ్ళాక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో రెండో సంవత్స రంలో చేర్పించింది.

స్వంత ఇల్లు, కౌలుకిచ్చిన పొలం, ప్రభుత్వం ఇచ్చే పెన్షన్. ఇద్దరు ప్రాణులకి ఇంకేం కావాలి? రోజులు సాఫీగా, ఏ బాదరబందీ లేకుండా గడిచిపోసాగేయి.

పవిత్ర కాలేజీకి వెళితే ఒంటరితనంతో తనకి పిచ్చెక్కి నట్టుండేది. తోచక ఇంటికి తాళంవేసి, గుడీ గోపురాలకి వెళ్ళి పురాణ కాలక్షేపాలు వింటూ కూర్చునేది. అనేక దైనందిన కార్యక్రమం అయిపోవడంవల్ల తన మనసంతా అవ్యాజ్యమైన ఆధ్యాత్మిక చింతనలో క్రమేపీ మునిగి పోసాగింది. ఎక్కడికో వెళ్ళాలి. ఏదో చూడాలి. తరిం చాలి. ఇలాటి ప్రేరేణ కలిగేది మనసులో.

ఇలా వుండగా, పవిత్ర ఇంటర్ కానిచ్చి, డిగ్రీ కాలేజ్‌లో బి.ఏ. మొదటి సంవత్సరంలో చేరింది. పవిత్రకి చదువు పిచ్చి ఎక్కువ. దానికి తోడు సాహిత్య పిచ్చివుంది. ఇంటర్ కాగానే వున్న ఆ ఒక్క నలుసునీ ఓ అయ్య చేతిలో పెట్టి, నిశ్చింతగా కృష్ణా రామా అను కుంటూ దేశంలోని పుణ్యస్థలాలన్నీ చుట్టి, తనువు చాలించా లనే తపన వుండేది తనకి.

తను గ్రాడ్యుయేట్ అయ్యేవరకూ పెళ్ళి ప్రసక్తి ఎత్త వద్దని కరాకండీగా చెప్పేసింది పవిత్ర. దాని ఏకోరిక కాదన గలిగింది తను? కంటికి రెప్పలా చూసుకుంటున్న చిట్టితల్లి అభీష్టానికి విరుద్ధంగా మెడవంచి మూడు ముళ్ళు వేయించగలదా? అందుకే కిమ్మనకుండా ఊరుకుంది.

ఇంటర్‌లో చదివేటప్పుడు పవిత్ర పరికిణీలూ, ఓణీలూ

వేసుకునేది. శారీరకంగా ఆడపిల్లల్లో మార్పు రావడం ఎంతసేపు? ఆ మార్పే కాలేజీలో చేరేక చీరెల అవసరం తెప్పించేయి పవిత్రకి.

అక్కణ్ణించీ మొలకెత్తింది కొత్త సమస్య! సాయంత్రం కాలేజీనించి రాగానే పుస్తకాలు మూలకి విసిరి చిందులు తొక్కేది. ఏం జరిగిందమ్మా అంటే, దార్లో ఎవ్వడో కొంటె కోణంగి కన్ను గీటేడనీ, ఈల వేసేడనీ మండి పడేది.

కాలేజీలో కుర్రాళ్ళు తనని చూడగానే సినిమా డ్యూయెట్లందుకుంటారుట. ఏదో ఓ కామెంట్ విసురుతుంటారుట. కాలేజి బ్యూటీ అనీ, మిస్ ఆంధ్రా అనీ ఏవో నిక్ నేమ్‌లూ తగిలించేరుట. కాలేజీకి వస్తున్నా, పోతున్నా ఎవ్వడో ఓ కుర్రాడు సైకిల్ మీద కూని రాగాలు తీస్తూ భత్యంలేని బాడీగార్డులా దిగబెడుతుంటాడట.

చదువుకునే అందమైన అమ్మాయిలకిది పరిపాటే. రోజూ జరిగేదింతే! పవిత్ర నవ్వితే పున్నమి జాబిల్లి జ్ఞప్తికి వస్తుంది. నడిస్తే హంసహొయలు స్ఫురణికి వస్తాయి. కాటిక దిద్దిన కళ్ళు చూస్తే లేడికళ్ళు ఇవేనా? అనిపిస్తుంది.

అటువంటి కుందనపు బొమ్మ కాలేజీ కుర్రకారులో చిచ్చు రగిల్చిందంటే రగల్చదూ మరి? కాని, రోజు రోజుకూ ఆ ఆగడాలు మితిమీరసాగేయి. ఒకటి రెండు సార్లు వళ్ళుమండి ఒకరద్దరు కుర్రాళ్ళని గూబలు గుయ్యి మనిపించిందట పవిత్ర.

అప్పటినించీ తన గుండెలో దడ ప్రారంభమైంది.

ఇంట్లో మగ దిక్కు లేని ఆడకూతుళ్ళు. పొగరుబోతు కుర్రకారు దేనికైనా తెగిస్తే? పవిత్రకేమైనా హాని జరిగితే తను జీవించగలదా? ఏదైనా ముంచుకువస్తే ఆదుకోడానికి చుట్టుపక్కల దగ్గరి బంధువులెవ్వరూ లేరాయె. ఈ సమస్య ఎట్లా పరిష్కరించేది?

చిన్న చిన్న పట్టణాల్లో ఎప్పుడూ ఈ చిక్కులు వుండనే వుంటాయి. ఊళ్ళో ఏ అమ్మాయైనా కాస్త అందంగా వుంటే చాలు, నలుగురి దృష్టిలో నానుతుంది. పనీ పాటా లేని జులాయి వెధవలకి ఓ చర్చై కూర్చుంటుంది.

పెద్ద పట్టణాల్లో ఇవన్నీ పట్టించుకునే నాథుడెవ్వడు? అక్కడ అడుగుతీసి అడుగువేస్తే ఓ అందమైన అమ్మాయి ఎదురుపడుతుంది. కిళ్ళీ బడ్డీలముందూ, టీకొట్ల దగ్గరా గంటల తరబడి నిల్చుని అమ్మాయిలగురించి మాట్లాడుకునే ఓపిక అక్కడెవరికుంటుంది?

అంధకారంలో ఆశాకిరణంలా సుభద్రమ్మ తళుక్కుమంది. హైద్రాబాద్ వంటి మహానగరంలో పవిత్రకి ఎలాంటి డిస్టర్బెన్సు వుండదు. నిక్షేపంగా చదువుకుంటుంది. ఒంటరిగా వున్న సుభద్రమ్మకి తమ తోడూ లభిస్తుంది.

ఈ ఆలోచన రాగానే సుభద్రమ్మపేర ఓ వుత్తరం రాసి పడేసింది. దానికి వెంటనే ఆమెనించి జవాబు వచ్చింది, బైలుదేరి రమ్మని. ఆలోగా తను ఇంటికోసం అద్దెవాళ్ళని సంపాదించుకుంది. వాళ్ళు నెల నెలా అద్దె ఎం.ఓ. జేసే ఒప్పందం కుదుర్చుకుని, అటు పెన్షన్ డబ్బులు కూడా హైద్రాబాద్‌లోనే ముట్టే ఏర్పాట్లు జేసుకుని ఓ శుభముహూర్తాన పవిత్రతో రైలెక్కింది.

ఇక్కడి ఉమెన్స్ ఆర్ట్స్ కాలేజీలో, బి.ఏ. సెకండి యర్లో చేరింది పవిత్ర.

సుభద్రమ్మ ఆప్యాయతానురాగాల మధ్య నాలుగు మాసాలు చిటికెలో దొర్లిపోయేయి. ఈ మహానగరంలో ఒంటరిగా తనకేమీ తోచేదికాదు. ఇక్కడి మనుషులకి ఒకరి గొడవ పట్టించుకోడానిగ్గానీ, యోగక్షేమాలు అడిగి తెలుసుకోడానిగ్గానీ తీరిక వుండదాయె. ఎప్పుడూ ఏదో ముంచుకు వచ్చినట్టు వురుకూ పరుగులూను.

పవిత్రా, సుభద్రమ్మా వెళ్ళిపోయేక రామాయణ మహా భారతాలతోనూ, భగవద్గీతా పారాయణంలోనూ కాలం వెళ్ళమార్చేది తను. ఆ మహాగ్రంధాల ప్రభావమేమో, క్రమేపీ తనలో ఎక్కడలేని ఆధ్యాత్మిక చింతన చోటు జేసుకుంది.

అప్పుడే ఓ ఆలోచన బీజం వేసుకుంది తనలో. పవిత్ర కిప్పుడు ఏ లోటూ లేదు. ప్రశాంతంగా కాలేజీ కెళ్ళి చదువు కుంటోంది. సుభద్రమ్మకూడా పవిత్రను కన్నకూతురులా ఎంతో అనురాగంగా చూసుకుంటోంది.

తనిలా గోళ్ళుగిల్లుకుంటూ కూర్చునే బదులు, పుణ్య తీర్థాలు దర్శించిరావాలని ఎన్నాళ్ళనించో తనలో మెదలు తున్న చిరకాల వాంఛని దేనికి తీర్చుకోకూడదు? ఇటువంటి అవకాశం మళ్ళీ వస్తుందా? ఈ కాయం ఎప్పుడు ఏవిధంగా రాలిపోతుందో ఎవ్వరు కలగన్నారు? తన వాంఛ తీరక ముందే ఈ జీవుడు పరలోకానికి ప్రయాణం కడితే?

పవిత్ర చదువైపోయేలోగా తను తీర్థాలన్నీ చుట్టి రావచ్చు. ఆ తరవాత దానికి మంచి సంబంధం చూసి, ఏడడుగులు వేయించి, రామనామం జపిస్తూ తృప్తిగా

కన్ను మూయవచ్చు. ఓ రోజు సుభద్రమ్మ ముందు ఈ విన్నపం వుంచింది తను. దానికి ఆవిడ గానీ, పవిత్ర గానీ ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదు.

కావలసిన డబ్బూ, అవీ తీసుకుని ఓ సుముహూర్తాన ప్రయాణం కట్టింది. చిన్న చిన్న మజిలీలు, సుదీర్ఘ ప్రయాణాలు, కాశీ, రామేశ్వరం, బనారసు, అలహాబాదు, చిత్ర కూట్ ఒక్కటేమిటి...ఎక్కడికెళ్ళినా ఏదో అనూహ్యమైన తృప్తి, మనశ్శాంతి! గతజన్మలో ఎన్ని పుణ్యాలు చేసుకుంటే ఇటువంటి అవకాశం దొరుకుతుంది?

ఎవ్వరో వస్తున్న అడుగుల శబ్దం వినిపించి కౌసల్యాదేవి ఆలోచనలు చెదిరిపోయేయి. తలెత్తి తలుపువైపు చూసింది. పాతికేళ్ళుంటాయి ఆ యువతికి, పచ్చగా పొడుగ్గావుంది. పసిమిఛాయ.

"పార్వతి నువ్వేనా అమ్మా?"

ఆ యువతి తలూపి "మీరు?" అంది ప్రశ్నార్థకంగా.

"నేను కౌసల్యాదేవిని. ఇంత క్రితం నిన్నెక్కడో చూసినట్టేవుంది. ఎన్నాళ్ళనించి పనిచేస్తున్నావమ్మా ఇక్కడ?"

"రెండేళ్ళవుతోందండీ! నాకూ మిమ్మల్నెప్పుడో చూసినట్టు తోస్తోంది. ఇంతకీ విషయం ఏమిటి?" అందా యువతి కౌసల్యాదేవి కెదురుగా కూర్చుంటూ.

"సుభద్రమ్మతో బాటు ఇక్కడ పవిత్ర అనే అమ్మాయి ఉండేది..."

"పవిత్రా! మీరు పవిత్ర అమ్మగారా?" అందా యువతి నోరు తెరుస్తూ.

కౌసల్యాదేవి మనసు ఉరకలు వేసింది. "ఔనమ్మా!

పవిత్ర నీకు తెలుసా?" అడిగింది ఆత్రుతగా.

"తెలియకేం?"

"ఎక్కడుంది పవిత్ర?"

"అహఁ... నాకు...సరిగ్గా...సరిగ్గా... తెలియదండీ!" అంది పార్వతి తడబడుతూ.

కౌసల్యాదేవి తెల్లబోయింది. పార్వతి ఏదో చెప్పటానికి తటపటాయిస్తున్నట్టూ, దాచడానికి ప్రయత్నిస్తున్నట్టూ అనుమానం వేసింది.

"పోనీ తెలిసినంతవరకూ చెప్పమ్మా! కన్న కూతుర్ని చూడాలని ఎంతో దూరంనించి కళ్ళల్లో వత్తులు వేసుకు వచ్చేను. నీ తల్లిలాటిదాన్ని. నిజాన్ని దాచి నన్ను క్షోభ పెట్టడం న్యాయమేనా?" అంది దీనంగా.

"ని...నిజంగా నాకేం తెలీదండీ! ఒక్క విషయం మాత్రం చెప్పగలను. పవిత్ర యిక్కడ లేదు!"

తలమీద ఏదో ఇనుపదూలం అకస్మాత్తుగా పడ్డట్టు తోచింది కౌసల్యాదేవికి.

"ఎక్కడుంది మరి?"

"తెలీదు. చాలా రోజులనించీ ఆమె ఇక్కడ కనిపించడం లేదు. ఎక్కడికెళ్ళిందో ఎందుకు వెళ్ళిందో కారణాలు నాకు తెలియవు!"

"ఎన్నాళ్ళనించి కనిపించడం లేదు?"

"బహుశా, ఏడాదిపైనే అయిందనుకుంటాను."

ఏడాది! అంటే, తనిక్కడినించి వెళ్ళిన కొద్ది నెలలకే పవిత్ర కనిపించడం లేదా? ఏమైంది? ఎక్కడికెళ్ళింది?

"ఇక నాకు సెలవిప్పిస్తారా? క్లాసులో పిల్లలు గొడవ పెడుతున్నట్లున్నారు. సుభద్రమ్మగారు వచ్చేక అన్ని విష

యాలూ అడిగి తెలుసుకోండి'' అంటూ లేచింది పార్వతి.

నేరస్తుడు పోలీసు ఆఫీసరు ముందు నిలిచి ఎంత త్వరగా బారుకుంటే అంత మంచిదనుకుంటాడు. అలా తోచింది కౌసల్యాదేవికి ఆ యువతి ప్రవర్తన. ఆమె జవాబుకెదురు చూడకుండానే పార్వతి గదిలోంచి వెళ్ళిపోయింది.

చేష్టలుడిగి అటే చూస్తుండిపోయింది కౌసల్యాదేవి.

2

బైట రిక్షా వచ్చి ఆగిన చప్పుడు వినిపించి ఆశగా తలుపువైపు చూసింది కౌసల్యాదేవి. ఎవ్వరో ఆఫీసువైపు వస్తున్న చెప్పుల సవ్వడి.

తలుపుగుండా లోనికి వచ్చిక సుభద్రమ్మ దృష్టి కౌసల్యాదేవిమీద పడి కాళ్ళకి ఏదో అడ్డుపడ్డట్టు అక్కడే ఆగిపోయింది. కౌసల్యాదేవి హృదయం పొంగి పొర్లింది. ఆమె పెదాలమీద జీవంలేని నవ్వొకటి పిల్లవాయువులా వీచి వెళ్ళింది. చేతులు జోడిస్తూ లేచి నిల్చుంది.

"చెప్పండి! నేను మీకేం..." అన్న వాక్యం సుభద్రమ్మ నోటివరకూ వచ్చి ఆగిపోయింది అప్పుడు గుర్తించింది ఆమె తన ఎదుట నిల్చున్నది ఎవ్వరో, "కౌసల్యా! నువ్వేనా?" అంది సంభ్రమంగా.

"గుర్తుపట్టలేనంత మారిపోయేనా సుభద్రా?"

"మారడం ఏమిటి? అసలు మారినట్టేలేవు. ఎవ్వరో కొత్తవ్యక్తిని చూసినట్టు భ్రాంతి కలిగిందంటే నమ్ము. ఆరోగ్యం విషయంలో యింత అశ్రద్ధ జేశావేమిటి?"

"కాలచక్రం దేన్ని స్థిరంగా వుంచుతుందని సుభద్రా?"

"పరాయి ఇంటికి వచ్చినట్లు ఇంకా నిల్చునేవున్నావేం? కూర్చో కౌసల్యా!" అని నిండుగా నవ్వుతూ లోనికి వచ్చి కూర్చుంది సుభద్రమ్మ.

అంతవరకూ - తెలియని భయంతో కొట్టుకుంటున్న కౌసల్యాదేవి గుండె సుభద్రమ్మ నవ్వు చూసి, స్థిమిత పడింది. పవిత్ర విషయంలో ఏదైనా అనర్థం జరిగివుంటే సుభద్రమ్మ అంత నిండుగా నవ్వుతూ దేనికి మాట్లాడుతుంది?

తేలిక పడ్డ మనసుతో కూర్చుంది కౌసల్యాదేవి.

"ఇదేనా రావడం?" అడిగింది సుభద్రమ్మ టేబిల్ మీద పెన్సిల్ అందుకుని గుండ్రంగా తిప్పుతూ.

"నాంపల్లిలో రైలు దిగగానే సరాసరి ఇక్కడికే వచ్చేను. మొత్తానికి చాలాసేపు నిరీక్షించ వలసి వచ్చింది నీ కోసం!"

"ఎక్కణ్ణించి బైలుదేరావు?"

"అలహాబాదు నించి కాశీ ఎక్స్‌ప్రెస్ ఎక్కేను. ఇటార్సీలో మరో బండి మారవలసివచ్చింది. రెండు రోజుల ప్రయాణం!"

"కార్డుముక్క కూడా వెయ్యకుండా ఇంత హఠాత్తుగా వస్తావనుకోలేదు."

"ఔను. అకస్మాత్తుగా బైలుదేరాను. అక్కణ్ణించి కార్డుముక్క వేసినా అది ఇక్కడ అందేసరికి నాలుగు రోజులు పడుతుందిట."

"కాలకృత్యాలు తీర్చుకున్నావా? కాఫీ, టిఫిన్ ఏనా తీసుకున్నావా లేదా?"

కౌసల్యాదేవి నవ్వి "ఇంకా ఎక్కడా? మిమ్మల్ని

చూడాలన్న ఆరాటం ఒక్క క్షణం ఆగనిచ్చిందా నన్ను?'' అంది.

ఇంత సేపైనా సుభద్రమ్మ పవిత్ర విషయం ఎత్తదేం? తమ మధ్య అనవసర సంభాషణ సాగుతోంది. నిజానికి, తనని చూడగానే ఆమె పవిత్ర సంగతి ఎత్తవలసింది. ఆరాటాన్ని ఇహ అట్టే సేపు ఆపుకోలేక అడిగేసింది కౌసల్యాదేవి.

''పవిత్ర ఎక్కడుంది సుభద్రా? కనిపించదేం? కాలేజీకి వెళ్ళిందా? బుద్ధిగా చదువుకుంటోంది కదా? నే వెళ్ళాక నిన్నేమీ ఇబ్బంది పెట్టలేదు కదూ?''

ఆ ప్రశ్నల వర్షంతో సుభద్రమ్మ మొహం హఠాత్తుగా వివర్ణమైపోయింది. కనుబొమలు ముడిచి, కౌసల్యాదేవిని విచిత్రంగా చూస్తూ, ''పవిత్ర ఎక్కడుందో నీకు తెలియదా?'' అడిగింది ఆశ్చర్యంగా.

''అదేమిటి సుభద్రా! పవిత్రని నీ దగ్గరేగా వదిలి వెళ్ళేను? ఇంకా ఎక్కడుంటుంది?''

''పవిత్ర ఇక్కణ్నించి వెళ్ళిపోయిన సంగతి నిజంగా నీకు తెలియదా?'' అంది సుభద్రమ్మ ఏదో చోద్యం చూస్తున్నట్లు.

''ఇక్కణ్నించి వెళ్ళిపోయిందా? ఎందుకు? ఎక్కడికి?'' కౌసల్యాదేవి కంఠంలో కంపన.

''ఓహ్ గాడ్! ఆ పిల్ల ఎంత మోసం చేసింది నన్ను? ఇక్కణ్నించి వెళ్ళిపోతూ, నీకన్ని విషయాలూ రాసేననీ, నీవు తననిక్కణ్నించి వెళ్ళిపోడానికి అనుమతించేవనీ చెప్పింది!''

''నా చిరునామాకు ఒక స్థిరత్వం అంటూ వుంటేగా

దానికి తెలియడానికి? ఈ సంగతి ఆలోచించలేదా నీవు? సుభద్రా ప్లీజ్, నా గుండె ఆగిపోయేలా వుంది. దయచేసి ఏం జరిగిందో కాస్త వివరంగా చెప్పి పుణ్యం కట్టుకో!"

సుభద్రమ్మ భారంగా నిట్టూర్చి, తలెత్తి చెప్పసాగింది. "ఇక్కడికి వచ్చే ఉత్తరాలన్నీ పవిత్రే చూసి వేరుజేసేది. రోజూ పోస్ట్ మెన్ వచ్చే వేళకి, వరండాలో పచార్లు చేస్తూ, అతనింకా గేట్లోకి ప్రవేశించకముందే పరిగెత్తి పోస్టు అందుకునేది.

ఈ స్కూలుతోబాటు నేను కొన్ని పోస్టల్ కోర్సులు కూడా నడుపుతున్న విషయం నీకు తెలిసిందే కదా? రోజూ ఎన్నో ఉత్తరాలు వస్తుంటాయి. పవిత్రే వాటిని వేరుజేసి అందించేది. అప్పుడప్పుడూ చెప్పేదికూడా 'అమ్మ దగ్గర్నించి ఉత్తరం వచ్చింది పిన్నీ' అని. 'ఏదీ ఉత్తరం? నాకు చూపించు?' అని నేనెప్పుడూ అడగలేదు.

'ఏం రాసిందేమిటి? ఆరోగ్యం ఎలా వుందిట?' అని నీ యోగక్షేమాలు మాత్రం కనుక్కునేదాన్ని.

ఇలా రెండు నెలలు గడిచి ఉంటాయనుకుంటాను.

ఒకరోజు పవిత్ర లేని సమయంలో పోస్ట్ మెన్ ఉత్తరాలన్నీ నా టేబిల్ మీద పెట్టి వెళ్ళేడు. అందులో పవిత్ర పేర ఉన్న గులాబిరంగు కవరుచూసి, నాకేదో సందేహం కలిగింది. కవరుమీద హాండ్ రైటింగ్ ఎవ్వరో పురుషుడిలా కనిపించింది. ఆడవాళ్ళ చేతివ్రాత అప్పుడే తెలిసిపోతుంది కదా? చూడకూడదనుకుంటూనే కవరువిప్పి చూసేను.

చేంతాడంత ఉత్తరం అది. దాన్ని ఉత్తరం అనే బదులు ప్రేమలేఖ అంటే సమంజసంగా వుంటుంది!

ఆ లేఖ చదివేక నేను గ్రహించిన విషయాలు ఇవి —

అది మొదటిసారి రాసిన ఉత్తరం కాదు. ఇంతకి ముందు అనేకం రాయబడ్డాయి. అందులో వున్న విషయాలనిబట్టి, పవిత్రకూడా వాటికి తాత్సారం జెయ్యకుండా జవాబు లిస్తోంది.

ఇద్దరూ గాఢంగా ప్రేమించుకున్నారు. పెద్దలు అంగీక రించినా, అంగీకరించకపోయినా, పెళ్ళికూడా జేసుకోవా లని నిశ్చయించుకున్నారు. ఆ కుర్రాడి పేరు గౌతమ్! బయోలాజికల్ సర్వే డిపార్ట్‌మెంట్‌లో టైపిస్టుగా పని జేస్తున్నాడు. ఆ ఉత్తరం రాసిన తీరూ, వాడి భాషా చూస్తే, అతను పత్రికలకీ వాటికీ కథలూ గట్రా రాస్తుం టాడేమో అనిపించింది.

ఉత్తరం ఇంకా నా చేతిలో వుండగానే పవిత్ర గది లోకి రావడం జరిగింది. నన్నూ, నా చేతిలోని ఉత్తరాన్నీ చూసి, మొదట తెల్లబోయినా తరవాత కోపంతో మొహం జేవురించింది.

'ఇలా రా!' అన్నాను.

పట్టుబడ్డ దొంగలా వచ్చి కూర్చుంది.

'ఎన్నాళ్ళనించీ సాగుతోందీ వ్యవహారం?' అని రెండు మూడు సార్లు రెట్టించి అడిగితే నోరు విప్పింది.

అతను నవలా రచయితట. ఎన్నాళ్ళనించో అతన్ని అజ్ఞాతంగా అభిమానిస్తోందిట. హైద్రాబాద్ వచ్చేక అనుకోకుండా అతనితో పరిచయం కలిగిందిట. ప్రేమించు కున్నారుట.

అతని కులంగోత్రం అడిగేను. మనలో ఎందులోనూ సరితూగడు.

నాకు వళ్ళు మండిపోయిందంటే నమ్ము. ఈ రచయి

తలు భావోద్రేకలు, అల్పసంతోషులు. రాబడీ తక్కువే. అనవసర మోహపాశాలకిలోనై, పండంటి భవిష్యత్తు మట్టిపాలు జేసుకోక! చిన్నతనం గనుక, లోకజ్ఞానం లేదు గనుక, ఏదో రాశావ్. ఈసారి క్షమిస్తున్నాను. మళ్ళీ ఇలా ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తే మాత్రం సహించేది లేదు.

నీ తల్లి వచ్చేవరకూ, ఆమెతో సంప్రదించేవరకూ ఆ పక్రాడి ఛాయలకి వెళ్ళొద్దు. నా సంరక్షణలో వున్న నీవు నేను గీచిన గీటు దాటకూడదు. రేపు ఏమైనా ఐతే, లోకం ఎవ్వరిమీద నిందలు మోపుతుంది? నీ తల్లి నామీద దుమ్మెత్తి పొయ్యదూ? అన్నాను దాదాపు అరుస్తూ.

దాంతో, నేను ఊహించని విధంగా ఒక్కసారి నా మీద విరుచుకు పడింది పవిత్ర! నిమ్మకి నీరెత్తినట్టుండే ఆ పిల్ల, అలా అపరకాళిలా దాడిజేస్తే చేష్టలుడిగి చూస్తుండి పోయేనంటే నమ్మ.

పాతకాలపు అమ్మాయిల్లా ఈనాటి యువతులకి ఒకరి సంరక్షణలో ఉండే అవసరం లేదుట. ఈనాటి ఆడపిల్లలకి తమ సంరక్షణ ఎలా చేసుకోవాలో బాగా తెలుసుట.

చేసుకుంటే ఆ అబ్బాయినే చేసుకుంటాను. లేదా, ఉరిపోసుకు చస్తాను. మీ కులగోత్రాల పాత చింతకాయ పచ్చడి చాదస్తాలతో తన నిర్ణయాన్ని కూల్చవద్దు అంటూ విసవిసా వెళ్ళిపోయింది. నిశ్చేష్టురాలినై అలా చూస్తుండి పోయేను.

ఆ సంఘటన జరిగిన రెండవరోజునే, మా అమ్మకు అన్ని వివరాలు తెల్పుతూ టెలిగ్రాం ఇచ్చేను. ఆవిడ జవాబు కోసం ఎదురు చూస్తున్నాను అని నాతో చెప్పింది.

అది జరిగిన మూడవరోజు సాయంత్రం - నీ దగ్గర్నించి టెలిగ్రాం వచ్చిందనీ, తనిక్కణ్నించి వెళ్ళిపోయి, తన స్నేహితురాలి ఇంట్లో ఉండటానికి నీవు అనుమతించేవనీ ప్రకటించింది. అప్పుడు నేను పడ్డ మనఃక్షోభ అంతా ఇంతా కాదు" అంది సుభద్రమ్మ.

కౌసల్యాదేవి కథంతా చాలా శాంతంగా వింది. అంత శాంతంగా ఎలా వినగలిగిందా అని తరవాత ఆమెకే ఆశ్చర్యం వేసింది. అతి కష్టంమీద తలెత్తి—"ఆ టెలిగ్రాం ఏదో చూపించమని నీ వడగలేదా?" అంది.

"ఆ పిల్ల అడిగే అవకాశం ఇస్తేగా? ఆదరాబాదరా బట్టలూ అవీ సూట్ కేస్ లో సర్దుకుని ఆటోలో కూర్చుని వెళ్ళిపోతేనూ! శిలాప్రతిమలా చూస్తూ వుండటమే తప్ప ఆ సమయంలో నా కాలూ చెయ్యీ ఆడగలిగిందా?"

గుండెలో రేనుగుర్రాలేవో దౌడుతీస్తున్నట్టు తోచింది కౌసల్యాదేవికి. పవిత్రని ఇక్కడ వదలి వెళ్ళి తనెంత తప్పు జేసిందో ఇప్పుడు తెలుస్తోందామెకి. తప్పు తనదా? లేక, పవిత్రని సరిగ్గా అదుపులో పెట్టలేక పోయిన సుభద్రమ్మదా? అదీ కాక, రోజు రోజుకూ వెర్రితలలు వేస్తూ—మారుతూ, పెద్దల అనుభవాలనీ, శాసనాలని ధిక్కరిస్తూ తమ ఇష్టానుసారం సాగిపోతున్న ఈ యువతరానిదా? ఎవ్వరిది?

ఇప్పుడు దోషం నీదీ నాదీ అంటూ మథనపడితే ఒరిగే దేమిటి? జరిగిందేదో జరిగిపోయింది. ఇహ జరగబోయే దాని గురించి యోచించడం వివేకం! "పవిత్ర వుంటానని వెళ్ళిన ఆ స్నేహితురాలి చిరునామా ఏమిటో తెలుసా నీకు?" అడిగింది కౌసల్యాదేవి ఆతృతగా.

"తెలీదు. ఆ అమ్మాయి నిదానంగా అన్నీ చెప్పి వెళితే కదా?"

"అదేమిటి? కాలేజీలో కనుక్కుంటే పోయేదిగా? రోజూ వస్తోందో, రావడం లేదో?"

సుభద్రమ్మ క్షణం మౌనంవహించి "పవిత్ర కాలేజీ మానుకుంది!" అంది.

కౌసల్యాదేవి గుండె ఒక్కసారి ఆగిపోయినట్టు తోచింది.

కనుక్కోవాలి. వెంటనే పవిత్ర ఎక్కడుందో కనుక్కోవాలి. ఎలా? ఎలా?

"అంత మాత్రాన నీవు దానిగురించి ఏమీ పట్టించుకో లేదా ఇన్నాళ్ళు?"

"నా మాట వినకుండా నన్నెదిరించి, ఇల్లువిడిచి వెళ్ళి పోయిన పిల్లకోసం నేను దేనికి దేవిర్లాడ్డం? ఆ అమ్మాయి మీద నా మనసు విరిగిపోయిందనుకో!"

సుభద్రమ్మ అన్న ఆ మాటలు కౌసల్యాదేవి గుండెల్లో శూలాల్లా దిగేయి.

నిజమే! ఆమెకీ తమకీ ఏమిటి బంధనం? ఏదో కలిసి పనిచేశామనీ స్నేహితురాలనీ తనకీ, తన కూతురికీ ఇంత ఆశ్రయమిచ్చింది, ఆదుకుంది. తన బంగారం మంచిది కానప్పుడు ఆమెనని ఏం లాభం?

కొంగులో మొహం కప్పుకుని వెక్కివెక్కి ఏడవ సాగింది కౌసల్యాదేవి.

"మరీ పసిపిల్లలా ఏమిటిది కౌసల్యా? నాకు పూర్తి నమ్మకం వుంది. పవిత్ర ఎక్కడ వున్నా సురక్షితంగా వుందని. చాలా కాలం క్రిందట నాకు కొన్ని సూచన

లం దేయి. పవిత్రని ఒకచోట చూసిన వాళ్ళు నాతో చెప్పేరు. ఇప్పుడక్కడే ఉందో లేదో నేను చెప్పలేను.''

కౌసల్యాదేవి కళ్ళు తుడుచుకుని ''ఏ కాస్త ఆధారం దొరకినా సరే, నాలో ఊపిరి ఉన్నంతవరకూ ప్రయత్నిస్తాను నా బిడ్డ ఎక్కడుందో కనుక్కోడానికి. త్వరగా చెప్పు సుభద్రా?'' అంది చిరు ఆశగా.

''శాంతి మహల్ టాకీసు తెలుసా నీకు?''

''ఆ దారమ్మట పోతూ ఒకసారి చూసినట్టు జ్ఞాపకం! ఏం?''

''పవిత్రని ఆ టాకీస్ బుకింగ్ ఆఫీసులో కూర్చుని టికెట్లమ్ముతుండటం ఒకరిద్దరు చూసినట్టు చెప్పేరు.''

''ఏమిటీ!'' తన చెవుల్ని తనే నమ్మలేకపోయింది కౌసల్యాదేవి. ''పవిత్రకి సినిమా టాకీసులో టిక్కెట్లమ్మే గతేంపట్టింది?'' అంది నమ్మనట్టు.

''నాకు తెలీదు. ఆ సంగతి విన్నాక ఆ అమ్మాయిమీద నా మనసు పూర్తిగా విరిగిపోయిందనుకో. అది ఎంతవరకు నిజమో కనుక్కోడానికూడా నేను ప్రయత్నించలేదు. ఆ టాకీసుకెళ్ళి, అక్కడి కర్మచార్లని అడిగితే ఏమైనా తెలియవచ్చు నీకు.''

దాంతో, ఆవిడకి తనవెంట రావడం ఇష్టం లేదనీ, తననే ఒంటరిగా వెళ్ళమని సూచిస్తోందనీ స్పష్టమైంది కౌసల్యాదేవికి. సుభద్రమ్మ ఎంత మారిపోయింది?

''సరే, వెళ్ళి కనుక్కుంటాను'' జారిపోతున్న గుండెల్ని కూడదీసుకుంటూ నీరసంగా లేచి నిల్చుంది.

''అదృష్టవశాత్తూ పవిత్ర కనిపించి, నామీద అవీ ఇవీ కల్పించి చెబితే నమ్మబాక!'' అంది సుభద్రమ్మ.

"నా చెవులు అంత పచ్చివి కావు సుభద్రా!" అంటూ బైటికి వచ్చింది కౌసల్యాదేవి.

స్కూలు ఆవరణ దాటగానే పోతున్న రిక్షా ఆపి ఎక్కింది. శాంత్ మహల్ టాకీసువైపు పోనిచ్చేడు రిక్షా వాడు. రోడ్డు పక్క ఓ గడియారం దుకాణంలో టైం చూసింది కౌసల్యాదేవి.

పదకొండు గంటలు!

పొద్దుటినించీ పచ్చి మంచినీళ్ళు ముట్టకపోయినా, ఏమీ తీసుకోవాలనిపించడం లేదు. ఆ స్థితిలో ఏ తల్లికి మాత్రం ఆకలి వేస్తుంది?"

3

శాంత్ మహల్ టాకీసు ముందు రిక్షా ఆగగానే, రిక్షా వాడికి డబ్బులిచ్చి ఆదరాబాదరా ఆవరణలోకి నడిచింది.

ఏదో ఇంగ్లీష్ పిక్చర్ మార్నింగ్ షో ఆడుతున్నట్టుం దక్కడ. పదకొండుంబావు అయింది గనక టిక్కెట్లివ్వడం ప్రారంభించేరు.

బుకింగ్ కిటికీల ముందు అప్పటికే జనం బారులుదీరి నిల్చునున్నారు. అందులో సగానికిపైగా నోట్ బుక్ లూ, పుస్తకాలూ పట్టుకుని, బెల్ బాటెమ్, హిప్పీ జులపాలతో వున్న స్కూలు పిల్లలూ కాలేజీ యువకులే. ఇంట్లో చదువు కని బైలుదేరి ఇక్కడ తయారవుతారన్న మాట.

ఒక్కో కిటికీని జాగ్రత్తగా పరిశీలిస్తోంది కౌసల్యాదేవి. రెండుమూడు కిటికీల్లో మగాళ్ళే టిక్కెట్లిస్తూ కనిపించేరు. చివరికి హైక్లాస్ బుకింగ్ విండోలో ఎవ్వరో స్త్రీ వున్నట్టు లీలగా కనిపించింది.

పవిత్రేనా? తన పవిత్రేనా? తెలుసుకోవాలన్న

ఆత్రంతో గబగబ అటు నడిచింది.

"చూడరోయ్! కాటికి కాళ్ళు జాపుకున్న ముసల్దాని కూడా ఇంగ్లీషు సినిమా కావాలిట. అందుకే మనలాంటోళ్ళకి సరిగ్గా టికెట్లు దొరికి చావడం లేదు" అన్నాడో కుర్రాడు వెనకనించి.

కౌసల్యాదేవికి వళ్ళు మండిపోయింది. తను కాటికి కాళ్ళు జాపుకున్నదా? ఈ ముదనష్టపు సినిమా చూడ్డానికొచ్చిందా. కలికాలం! ఈ హిప్పీ వెధవలకి చిన్నా పెద్దా, మంచీ మర్యాదా వుంటేగా?

ఇంతలో మరొకడరిచేడు, "ఏవమ్మా గంటనించీ ఇక్కడ చస్తున్నాం ఎండలో, ఇప్పుడే రిక్షాదిగి అమెరికా రాకెట్ లా అట్లా దూసుకుపోతే, మా గతేంగాను?"

వాడి తప్పెటకి తాళం వేస్తున్నట్టు మిగతా హిప్పీలు గొల్లుమన్నారు.

"నేను సినిమా చూడ్డానికి రాలేదు నాయనా! ఆ కిటికీలో కూర్చున్న అమ్మాయితో ఓ క్షణం మాట్లాడిపోతాను" అంది కౌసల్యాదేవి అందర్నీ సంబోధిస్తూ సాధ్యమైనంత శాంతంగా.

"అలాగా! సరే కానివ్!" అంటూ అప్పుడే టికెట్ తీసుకోబోతున్న ఓ యువకుడు పక్కకి జరిగాడు. ఆ అవకాశం జారిపోతుందో అన్నట్టు వేగంగా కిటికీని సమీపించి, లోనికి తొంగిచూసింది కౌసల్యాదేవి.

ఆ అమ్మాయి పవిత్ర కాదు!

నిరాశతో కౌసల్యాదేవి నవనాడులూ కృంగిపోయేయి.

ఆ యువతికూడా కళ్ళెత్తి ఆమెవైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"పవిత్ర ఎప్పుడు వస్తుందమ్మా ఇక్కడికి?" అడిగింది కౌసల్యాదేవి.

"పవిత్రా?"

"ఔను! ఇక్కడ వుద్యోగం చేస్తోందిటగా? ఆమె డ్యూటీ ఎప్పుడు?" సరిగ్గా ఆదేసమయంలో సినిమా ప్రారంభం కాబోతున్నట్టు మొదటి బెల్ మోగింది. హాలులో నిల్చున్న కుర్రాళ్ళంతా గోల జెయ్యసాగారు.

"చూడండీ! నేను చాలా బిజీగా వున్నాను. మీకే వైనా వివరాలు కావలిస్తే మేనేజర్ ఆఫీసుకెళ్ళి అడగండి!" అందా యువతి తనపనిలో నిమగ్నమౌతూ. భరించలేని నిరాశతో కాళ్ళీడ్చుకుంటూ అక్కణ్నించి కదిలింది కౌసల్యాదేవి. ఆమెని చూడగానే ఏమిటన్నట్టు కళ్ళెగరేసేడు మేనేజర్.

"నా కూతురు పవిత్ర మీ దగ్గిర బుకింగ్ క్లర్క్‌గా పనిజేస్తోందని తెలిసింది. ఆమెకోసం వచ్చేను."

అతని కనుబొమలు ముడిపడ్డాయి. "పవిత్రా?" అంటూ కాసేపు ఏదో జ్ఞాపకం జేసుకోడానికి ప్రయత్నించి–"ఆ అమ్మాయి మాదగ్గిర వుద్యోగం వదిలి చాలా రోజులయిందే?" అన్నాడు ఆశ్చర్యంగా.

"చాలా రోజులైందా?" కౌసల్యాదేవి హతాశురాలయింది.

'ఔను! ఆ అమ్మాయి దాదాపు నెలరోజులు ఇక్కడ పనిజేసి వుంటుంది.

తరువాత...త...తనే వుద్యోగం మానుకుని వెళ్ళిపోయింది" అన్నాడు మేనేజర్ తడబడుతూ.

అతని తడబాటులో ఏదో అసహజత్వం, దొంగతనం ద్యోతకమౌతోంది. కౌసల్యాదేవిలో కోటి అనుమానాలు

పడగలెత్తేయి. పవిత్ర తనకు తానే వుద్యోగం మాను కుందా? లేక ఇక్కడి పరిస్థితులు మానుకోమని వత్తిడి తెచ్చేయా? అపురూప సౌందర్యవతి ఐన తనబిడ్డని వీడే దైనా చెయ్యడానికి ప్రయత్నించలేదు కదా!

"పవిత్ర దేనికి వుద్యోగం మానుకుంది? మానుకుని ఎక్కడికెళ్ళిందో దయచేసి చెప్పగలరా?" అంది జీవం లేని స్వరంతో.

"కాలేజీ చదువులు ముగించుకున్న యువతీ యువకులు, గవర్నమెంట్ జాబ్స్ దొరికేవరకూ తాత్కాలికంగా ఇటువంటి వుద్యోగాలు చేస్తుంటారు. ఎక్కడైనా వుద్యోగం తగిలితే వీటికి తిలోదకాలిచ్చి వెళ్ళిపోతారు.

ఇక పవిత్ర ఏ వుద్యోగం సంపాదించుకుందో, ఎక్కడి కెళ్ళిందో నేను చెప్పలేను గానీ ఆమె ఇక్కడ పనిలో జేరేటప్పుడు రాయించిన చిరునామా మాత్రం ఇవ్వగలను. కూర్చోండి" అన్నాడు మేనేజర్ కుర్చీ చూపిస్తూ.

కౌసల్యాదేవి అందుకోసమే ఎదురు చూస్తున్నట్టు కుర్చీలో కూలబడింది. కడుపులో ఏమీ లేక ఎక్కువసేపు నిల్చునే స్థితిలో లేదు మరి.

మేనేజరు బల్ల సొరుగులాగి రిజిస్టర్ తీసేడు. పేజీలు తిప్పి "చెబుతాను రాసుకోండి!" అన్నాడు.

కౌసల్యాదేవి తటపటాయించి "నా దగ్గిర పెన్ను లేదు" అంది.

"ఓహ్, సారీ!" పేడ్ దగ్గరికి లాక్కున్నాడు మేనేజర్, చిరునామా రాసి కాగితం చింపి ఆమె ముందుంచేడు.

దాన్ని అందుకుని ఆత్రుతగా చదువుకుంది కౌసల్యాదేవి.

మిస్ లలిత,

హౌస్ నెంబర్, 3-6-532/1,

హార్డికార్ బాగ్, హిమాయత్ నగర్.

చీకట్లో చిరు దీపంలా ఈ మాత్రం ఆధారం దొరికింది చాలు, అనుకుంటూ మేనేజర్‌కి కృతజ్ఞతలు తెల్పుకుని ఇవతలికి వచ్చింది. వడివడిగా నడుస్తూ గేటును సమీపించింది.

సరిగ్గా అదే సమయంలో అదే గేటుగుండా లోనికి తిరుగుతూ ఎదురైన యువతిని చూడగానే కౌసల్యాదేవి కాళ్ళు స్తంభించేయి.

ఆమె పార్వతి! సుభద్రమ్మ స్కూల్లో కనిపించిన పార్వతి. కౌసల్యాదేవిని చూడగానే పార్వతి గబగబ ముందుకు వచ్చి "మీకోసమే పరిగెత్తుకొస్తున్నాను. నేనొచ్చేలోగా ఇక్కడ కనిపిస్తారో లేదో అనుకుంటూ ఆందోళన పడుతున్నాను" అంది.

4

కౌసల్యాదేవికేమీ అర్థం కాలేదు. "నా కోసమా? ఎందుకు? సుభద్ర పంపిందా?" అడిగింది ఆశ్చర్యంగా.

"నో.నో. ఆవిడకి తెలీకుండా వచ్చేను. మీకు కొన్ని ముఖ్య విషయాలు చెప్పాలి. ఆఫీసులో ఆవిడ మధ్యా, మీ మధ్యా జరిగిన సంభాషణంతా నేను బైటవుండి విన్నాను. వాస్తవం ఏమిటో మీకు తెలీనివ్వకుండా చాలా జాగ్రత్తపడ్డారు ఆవిడ. అప్పుడే అనుకున్నాను మీకన్నీ చెప్పి తీరాలని. అందుకే మీ వెనకే బైలుదేరి వచ్చాను" అంది పార్వతి వేగంగా.

కౌసల్యాదేవికంతా అయోమయంగా వుంది. సుభద్రమ్మ వాస్తవాన్ని తనముందు కప్పిపుచ్చిందా? ఏమిటి?

"ఇప్పటికే ఊహించని విధంగా ఎదురౌతున్న సంఘటనలతో నా మస్తిష్కం ఆలోచనా రహితమైపోయింది. త్వరగా చెప్పమ్మా ఏమిటో అది?" అంది ఆరాటంగా.

"ఇక్కడకాదు. రండి ఆ హోటల్లో కూర్చుందాం!" అంది పార్వతి, రోడ్డువైపు అడుగులు వేస్తూ.

తడబడే అడుగులతో ఆమెని అనుసరించింది కౌసల్యాదేవి.

రోడ్డుదాటి ఎదురుగావున్న ఉడిపి హోటల్లో ప్రవేశించారిద్దరు. కాఫీలవీ అయ్యేక పార్వతి ప్రారంభించింది. "మీరనుకున్నట్టు పవిత్ర ప్రేమలేఖ పట్టుబడిందనీ, సుభద్రమ్మ చీవాట్లు పెట్టిందనీ కాదు ఆ ఇల్లు విడిచింది. దాని తరవాత మరొక సంఘటన చాలా గంభీరమైన సంఘటన జరిగింది. ఆ సంఘటనవల్లే పవిత్ర మనసుతిరిగి ఆ ఇల్లు విడిచి వెళ్ళిపోవలసి వచ్చింది."

"ఏమిటది?" కౌసల్యాదేవి కంఠంలో కంపన.

"ప్రేమలేఖ పట్టుబడ్డ తరవాతా, సుభద్రమ్మతో ఘర్షణపడ్డ తరవాతకూడా పవిత్ర అక్కడే మామూలుగా వుంది. ప్రశాంతంగా పదీ పదిహేను రోజులు గడిచి వుంటాయి.

ఇంతలో ఒకరోజు సుభద్రమ్మ బంధువుల అబ్బాయి ఒకతను చుట్టపు చూపుగా వాళ్ళింటికి రావడం జరిగింది. అతను పవిత్రకంటే రెండు మూడేళ్లు పెద్దనుకుంటాను. చూట్టానికి బాగానే వుండేవాడు.

పవిత్ర అపురూప సౌందర్యం అతన్ని విపరీతంగా

ఆకర్షించింది. చేసుకుంటే ఆ అమ్మాయినే చేసుకుంటానని జలగలా పట్టుకున్నాడు సుభద్రమ్మని. ఆ అమ్మాయి ఎవ్వరో ముక్కూ మొహం తెలియనివాడికి ప్రేమలేఖలు రాస్తోందనీ, అటువంటి సంబంధం మనకొద్దనీ అతనికి నచ్చ చెప్పడానికి శతవిధాలా ప్రయత్నించింది సుభద్రమ్మ.

ఐనా అతను తన పుడుం పట్టువదల్లేదు. ప్రేమలేఖల తతంగం ప్రతిటీన్ ఏజ్ యువతీ యువకుల్లో జరిగేదేనని, తెలియని వయసుగనక ఏదో రాసి వుంటుందనీ, అదేమంత పట్టించుకోతగ్గ విషయంకాదనీ, పవిత్రకి తన అభీష్టం తెల్పి ఎలాగైనా ఒప్పించమనీ పోరేడు.

చేసేదిలేక, ఒకరోజు పవిత్రని అడిగేసింది సుభద్రమ్మ.

తన మనసులో మరొకరికి స్థానం ఇచ్చేననీ, చేసుకోననీ నిర్మొహమాటంగా చెప్పేసింది పవిత్ర. ఆ జవాబువిని ఆ యువకుడు అగ్గిమీది గుగ్గిలం అయ్యేడు. అతని అహం దెబ్బతింది. ద్వేషం రగులుకుంది.

ఒకరోజు సాయంత్రం సుభద్రమ్మ పనిమీద రిక్షాలో బైటికెళ్ళిందిట. పవిత్ర తన గదిలో చదువుకుంటోందిట. ఆమెమీద పెంచుకున్న పశువాంఛ తీర్చుకోడానికి అదే అదునను కున్నాడతను. పవిత్ర గదిలోకెళ్ళి చెయ్యి పట్టి బలాత్కరించడానికి ప్రయత్నించేడుట.

పవిత్ర చిరుతలా అతనిమీద లంఘించి, రక్కి కొరికీ ఎలాగో తప్పించుకుని బైటపడిందట. తరవాత సుభద్రమ్మ వచ్చేక జరిగిన విషయం చెప్పిందిట ఆవిడకి.

ఆ అబ్బాయి అటువంటివాడు కాదనీ, ఇదంతా వట్టి బూటకమనీ తనమీద కక్షతో ఆ కుర్రాడిమీద అభాండాలు వేసి, నలుగుర్లో తనని నవ్వులపాలుజేసి కసితీర్చుకో

డానికి అల్లిన కట్టుకథని, ఎట్టి పరిస్థితిలోనూ తను దీన్ని నమ్మననీ తేల్చి చెప్పిందిట సుభద్రమ్మ.

దాంతో, పవిత్ర భద్రకాళిలా ఆమెమీద విరుచుకు పడింది. గుండెల్లో రగిలే లావాను మాటల రూపంలో ఆవిడమీద గుమ్మరించి, ఒక్క క్షణంకూడా అక్కడుండకుండా అప్పప్పుడే తన సామానుతో అక్కణ్నించి బైట పడింది. ఇదీ అసలు కథ! ఈ విషయాలన్నీ నాకెలా తెలిశాయంటే, మర్నాడు కాకతాళీయంగా ఆబిడ్స్‌లో కనిపించింది, పవిత్ర స్వయంగా చెప్పింది ఇవన్నీ'' అంది పార్వతి.

భగవాన్! సుభద్రమ్మ ఎంత నాటకమాడింది తనతో. తప్పంతా పవిత్రదే అయినట్టూ, తన దోషం ఏమీ లేనట్టూ ఎంత కుటిలనీతి ప్రదర్శించింది. నమ్ముకున్న వాళ్ళని ఎందుకిలా నట్టేట్లో ముంచడానికి ప్రయత్నిస్తారు మనుషులు?

అప్పుడు గుర్తుకు వచ్చాయి కౌసల్యాదేవికి, తను వస్తుండగా సుభద్రమ్మ అన్న చివరి మాటలు. 'అదృష్టవశాత్తూ పవిత్ర కనిపించి నా మీద అవీ ఇవీ కల్పించి చెబితే నమ్మబాక!' ఎంతటి కుటిలత్వం దాగివుంది ఆ మాటల్లో.

పవిత్ర గురించి ఇన్నాళ్ళూ పట్టించుకోకుండా ఆమె మానంగా దేనికుందో యిప్పుడర్థమౌతోంది. పార్వతి పనిగట్టుకుని ఇంత దూరము వచ్చి అసలు సంగతి చెప్పకుంటే తనింకా అంధకారంలోనే ఉండేది కదా?

''నీ మేలు మరచిపోలేనమ్మా పార్వతీ!'' అంది కౌసల్యాదేవి చెమ్మగిల్లిన కళ్ళతో.

''ఈ విషయాలన్నీ మీకు తెలిసినట్టు సుభద్రమ్మకు అనుమానం రానివ్వకండి. ఎందుకంటే ఆవిడ వెంటనే

గ్రహిస్తుంది మీకివన్నీ ఎవరు చెప్పివుంటారో. అప్పుడు నా ఉద్యోగం కాస్త ఊడే ప్రమాదముంది. ఇక్కడ పవిత్ర గురించి ఏమైనా తెలిసిందా?" అడిగింది పార్వతి.

కౌసల్యాదేవి తలూపి, మేనేజర్ రాసిచ్చిన కాగితం తీసి చూపెట్టింది.

పార్వతి ఆ చిరునామా చూసి "భగవంతుడి దయవల్ల పవిత్ర మీకు తప్పక దొరకవచ్చు. ఇక వెళదామా?" అంది లేస్తూ.

కౌసల్యాదేవి ఎంత ప్రయత్నించినా, బిల్ యివ్వనివ్వకుండా అడ్డుపడి తనే పేచేసింది పార్వతి. తరవాత సెలవు తీసుకుని రిక్షా ఎక్కి వెళ్ళిపోయింది.

రోడ్డుపక్క ఆగివున్న ఆటోవైపు అడుగులు వేసింది కౌసల్యాదేవి.

5

వాళ్ళనీ వీళ్ళనీ అడుగుతూ ఎట్టకేలకి ఆ ఇంటి ముందు ఆటో దిగింది.

ఇంటి తలుపు మూసివుంది. నయం, తాళం వేసిలేదు. మీటర్ చూడకుండానే డ్రైవర్ అడిగినంత అతని చేతిలో పెట్టి గబగబ ఇంటిని సమీపించింది.

గుండెలో ఏదో అనిర్వచనీయమైన దడ! దాహంతో నాలిక పిడచగట్టుకుపోయిన బాటసారికి అమృతభాండం దొరకబోతున్న ఆనందం అది.

మెల్లిక్క తలుపు తట్టింది.

"ఎవరూ?" వినిపించింది స్త్రీ కంఠం.

కౌసల్యాదేవికి ఏమనాలో క్షణం తోచలేదు. "నేను, పవిత్ర తల్లిని!" అంది చివరికి.

తలుపు వెంటనే తెరుచుకుంది. ఆ స్త్రీకి దాదాపు కౌసల్యాదేవి వయసే వుంటుంది.

"నేను, పవిత్ర తల్లిని, కౌసల్యాదేవిని!"

"నమస్తే! రండి, లోపలకు రండి," అందామె తలుపు కడ్డం తొలుగుతూ.

కౌసల్యాదేవి లోనికి నడిచింది.

ఆమె ఓ మూలవున్న చాప చుట్టి తీసుకువచ్చి కింద పరిచి, "కూర్చోండి!" అంది.

కౌసల్యాదేవి కూర్చుంది.

ఆమెకూడా ఎదురుగా కూర్చుంటూ "పవిత్రకీ, మీకూ చాలా పోలికలున్నాయి. చూడగానే గ్రహించేను" అంది.

కౌసల్యాదేవి నవ్వి, "రక్తసంబంధం కదా?" అంది.

"ఉండండి. స్టౌమీద కాసిన్ని టీనీళ్ళు పడేసి వస్తాను" అంటూ లేవబోయిందా స్త్రీ.

"వద్దు, వద్దు యిప్పుడే తాగి వచ్చేను. ఇంతకీ పవిత్ర ఇంట్లో వుందా?"

"అయ్యో పవిత్ర యిక్కణ్ణించి వెళ్ళిపోయి చాలా కాలమయిందే! మీకు తెలియదా?" అందావిడ మధ్యలోనే.

అంతవరకూ ఆడుతున్న ఊపిరి, ఒక్కసారి స్థంభించిపోయినట్టు తోచింది కౌసల్యాదేవికి.

అతి కష్టంమీద గుండె చిక్కబట్టుకుని "చాలా కాలం క్రితమే వెళ్ళిపోయిందా? ఎక్కడికి?" అంది నూతిలోంచి పలికినట్టు.

"ఎక్కడికో నాకూ సరిగ్గా జ్ఞాపకం లేదు. ఆఁ! ఏదో

గెస్టుహౌస్‌లో వున్నట్టు విన్నాను, ఉండండి" అంటూ ఇంట్లోకి తొంగి చూసి "రమేశ్! నాయనా రమేశ్!" అని పిలిచిందామె.

లోపలినించి ఎటువంటి జవాబు రాలేదు.

ఆవిడ కౌసల్యాదేవి వైపు తిరిగి "రమేశ్ నా కొడుకు. బి. కాం. చదువుతున్నాడు. వాడొక్కడే మగ నలుసు నాకు. లోపల స్నానం జేస్తున్నాడు. ఆ గెస్టుహౌస్ పేరేమిటో బహుశా వాడికి తెలిసివుంటుంది. బహుశా ఏమిటి తప్పకుండా తెలిసివుంటుంది!" అంది.

అతను బైటకొచ్చేవరకూ ఓపిగ్గా కూర్చొనే సహనం నాలోలేదు. ఇవతలినించే అడగండి, ఆ గెస్టుహౌస్ ఎక్కడుందో? నేను వెంటనే అక్కడికి బైలుదేరాలి. అనాలనుకుంది కౌసల్యాదేవి. కాని, సభ్యత నోటికి తాళం వేసింది.

"పవిత్ర కేవలం మూడు వారాలు ఉండివుంటుందిక్కడ. నా కూతురు లలితా, పవిత్రా స్నేహితురాళ్ళుట. ఒక రోజు సాయంత్రం సామానులతో హాఠాత్తుగా ఇక్కడికి వచ్చింది పవిత్ర.

తనువున్న చోట ఈ రోజు పెద్ద గొడవ జరిగిందనీ, ఇంకా తను అక్కడే వుంటే ఏమైనా జరగవచ్చనీ, కొన్నాళ్ళు మా ఇంట్లో తనకి రక్షణ కల్పించమనీ కోరితే కాదనలేక పోయేము. నేను భర్తృహీనను" అందామె పైటకొంగు తలమీదికి లాక్కుంటూ.

"నేనూ విధవనేనమ్మా! నాకు తెలుసు, భర్తృహీనుల జీవితాలు ఎంత దుర్భరంగా,ఎంత నిస్సారంగా ఉంటాయో. ఆపదలోవున్న నా కూతురికి రక్షణ ఇచ్చి ఆదుకున్న మీ

హృదయ వైశాల్యత ఎంతటిదో అంచనా వేసే అవసరం లేదు'' అంది కౌసల్యాదేవి కృతజ్ఞతగా.

''పవిత్ర బాల్యంలోనే మీ శ్రీవారు పోయేరని తెలిసింది. అందుకే మాకు ఆ అమ్మాయిపట్ల ఎక్కువ సానుభూతి వుండేది. ఏదో, నేనూ ఇద్దరు పిల్లల్ని రెండు కళ్ళుగా చూసుకుంటూ బ్రతుకీడుస్తున్నాను. మాటల్లో అసలు విషయమే చెప్పడం మర్చేను.

పవిత్ర యిక్కడికి వచ్చిన ఐదవరోజే, నా కూతురు లలితకి వరంగల్‌లో ఉద్యోగం వస్తే జాయినవడానికి వెళ్ళిపోయింది ఉద్యోగంలో. ఇహ ఇంట్లో నేనూ, పవిత్రా రమేశ్ ముగ్గురమే మిగిలిపోయాం!''

''పవిత్రవల్ల మీకెలాంటి ఇబ్బందీ కలకలేదు కదా?'' అడిగింది కౌసల్యాదేవి.

ఆమె నిట్టూర్చి ''ఇబ్బంది కలిగింది! కాని, అది పరాకాష్టనందుకోకముందే పవిత్ర ఇక్కణ్ణించి చల్లగా జారుకుంది...అప్పుడప్పుడూ ఇంట్లో ఏమీ తోచక నేను ఇరుగు పొరుగు ఇళ్ళకి పోతుండేదాన్ని. అటువంటి సమయాల్లో పవిత్రకీ, రమేశ్‌కీ మంచి ఏకాంతం లభించేది... ఇంకా రమేశ్‌కి పెళ్ళి కాలేదు...''

కౌసల్యాదేవి గుండె గతుక్కుమంది.

''అంటే...వాళ్ళ మధ్య...''

ఆమె తల విదిలించి ''కాదు. కాదు. వ్యవహారం అంతవరకూ సాగలేదులెండి. ఐనా, వాళ్ళమధ్య ఏదో ఆకర్షణ పెరుగుతున్నట్టు నాకనుమానం వేసింది. రోజురోజుకూ ఆ ఆకర్షణ ఉధృతం అవుతున్నట్టు గమనించేను.

నా అనుమానాన్ని పవిత్ర పసిగట్టివుంటుంది. అందుకే,

నేను చెప్పకముందే, తనంతట తాను ఇక్కణ్నించి వెళ్ళి పోయింది...'' ఆమె మాట ఇంకా పూర్తి కాలేదు.

ఇంతలో, లోపల బాత్ రూం తలుపు తెరుచుకున్న చప్పుడయింది.

''రమేశ్! ఇలా రా నాయనా, పవిత్ర తల్లి ఆమె కోసం వెతుక్కుంటూ వచ్చేరు. ఆ గెస్ట్ హౌస్ చిరునామా ఏమిటో కాస్త చెప్పి వెళ్ళు'' అందామె లోనికి తొంగి చూస్తూ.

అతను లోపలనించి సన్నగా ఏదో గొణిగేడు.

''సిగ్గుపడుతున్నట్టున్నాడు. కూర్చోండి వెళ్ళి కనుక్కుంటాను'' అంటూ లేచి లోనికి వెళ్ళిందామె.

కాసేపు తల్లీకొడుకులు గుసగుసలు వినిపించసాగేయి.

పవిత్రవంటి యువతి ఆకర్షితురాలైన ఆ యువకుడు ఎంత అందగాడో ఒక్కసారి చూడాలన్న క్యూరియాసిటీ కలిగింది కౌసల్యాదేవికి.

మరుక్షణం ఆమె కోరిక తీరనే తీరింది. ఆ యువకుడు రెప్పపాటు ఇవతలికి తొంగి చూసి చటుక్కున లోనికెళ్ళి పోయేడు.

అతన్ని చూడగానే కౌసల్యాదేవి కళ్ళు ఆశ్చర్యంతో విప్పారేయి.

కారునలుపు, మొహంమీద స్ఫోటకం మచ్చలు, లావుపాటి పెదాలు, అస్తవ్యస్తంగా పడున్న గజం పొడవు హిప్పీ జులపాలు.

అంత దుఃఖంలోనూ కౌసల్యాదేవికి నవ్వాగలేదు.

ఈ నీగ్రో వెధవ పవిత్రని ఆకర్షించేడా? అంతా అబద్ధం! ఒంటరిగా, అందంగా అందుబాటులో ఉందికదా

అని వీడే ఏవో వెర్రివేషాలు వేసివుంటాడు. పవిత్ర గూబలు వాయించి వుంటుంది.

సుభద్రమ్మలాగే, ఈమె కూడా తన కొడుకు తప్పు కప్పిపుచ్చడానికి, దోషమంతా తన కూతురి మీదికి నెడు తోంది. అదే నిజమైతే, రమేశ్ ఏ తప్పూ చెయ్యని వాడైతే, తన ఎదుట పడకుండా ఆడంగిలా దేనికి మొహం చాటు చేసుకుంటున్నాడు?

భగవాన్! మనుషుల్లో ఇంతటి గరళాన్ని ఎందుకు నింపేవు?

ఇంతలో ఆమె లోపలినించి వచ్చి, చిన్న కాగితాన్ని కౌసల్యాదేవి కందించింది. దాన్ని ఆత్రుతగా అందుకుని చూసింది కౌసల్యాదేవి.

అన్నపూర్ణా గెస్ట్‌హౌస్, సీతాఫల్ మండీ!

లేచి, ఆమెకో నమస్కారం పెట్టి ఇవతలికి వచ్చింది.

6

పసుపురంగు రెండంతస్తుల భవనంముందు ఆగింది ఆటో.

కళ్ళజోడు సరిచేసుకుంటూ తలెత్తి సైన్‌బోర్డు చూసింది కౌసల్యాదేవి.

'అన్నపూర్ణా గెస్ట్‌హౌస్'

ఆటో వాడికి మీటర్ డబ్బులిచ్చి గబగబ లోనికి నడిచింది. నడవా పక్కనే ఉన్న ఓ గది గుమ్మానికి 'ఆఫీస్' అనే బోర్డు వేలాడుతోంది. స్ప్రింగ్ డోర్స్ మూసి వున్నాయి.

"లోపలికి రావచ్చా అండీ?"

"ఎస్. కమిన్!" స్త్రీ కంఠం వినిపించింది.

స్ప్రింగ్ డోర్స్ తోసుకుంటూ లోన అడుగుపెట్టింది కౌసల్యాదేవి.

ముప్పైవిదేళ్ళుంటాయి ఆమెకి. ఎర్రగా ఆకర్షణీయంగా వుంది. నిండైన శరీరం. ఖరీదైన పట్టుచీర. అందంగా వేసుకున్న జుత్తు ముడి. ఆమె కూర్చున్న తీరులో ఏదో ఠీవీ, గాంభీర్యం ఒలుకుతున్నాయి.

కౌసల్యాదేవిని ఒకసారి నఖశిఖపర్యంతం పరీక్షగా చూసి—"చెప్పండి!" అంది.

"పవిత్ర అనే అమ్మాయికోసం వచ్చేను. మీ గెస్ట్ హౌస్‌లో ఉంటోందని తెలిసింది. నేనామె తల్లిని..."

"అలాగా! అందుకే మీ ముఖం ఎక్కడో చూసినట్లనిపించింది. పవిత్ర ఇక్కడినించి వెళ్ళిపోయి చాలారోజులయిందే? మీకు తెలియదా?" అందామె ఆశ్చర్యంగా.

కౌసల్యాదేవి నవనాడులూ కృంగిపోయేయి! నిల్చోలేక స్టూలుమీద చతికిలబడింది.

"ఇంకా నయం! తనంతట తనే వెళ్ళిపోయింది. లేకుంటే నేనే నోటీస్ ఇచ్చేదాన్ని ఇక్కణ్ణించి వెళ్ళిపొమ్మని!"

"ఎందుకు? పవిత్ర ఏం తప్పు చేసింది?"

"ఈ గెస్ట్ హౌస్‌లో దూర ప్రదేశాలనించి వచ్చి, ఇక్కడ ఉద్యోగాలు చేసుకుంటున్న ఒంటరి యువతులూ, ఉద్యోగం దృష్ట్యా భర్తొకచోటా, పిల్లలొకచోటా, తనొకచోటా అవస్థలు పడుతున్న స్త్రీలూ ఉంటారు.

వంట చేసుకోలేని వాళ్ళకి ఇక్కడ మెస్ సిస్టమ్ కూడా వుంది. నెలకి ఇంత చొప్పున డబ్బు తీసుకుని వాళ్ళకి వసతీ, భోజనం ఏర్పాట్లు చేస్తాం. స్వయంపాకం చేసుకోవాలనుకున్న వాళ్ళు గదుల్లోనే స్టవ్‌లమీద ఇంత ఉడకేసుకు తినిపోతారు.

ఎనిమిది నెలల క్రితం కాబోలు, అందరిలాగే పవిత్ర

_డ చేరింది. చేరడానికి ఏవేవో కారణాలు చెప్పింది
ది.

ఇక్కడున్న అమ్మాయిలనీ, స్త్రీలనీ చూసిపోడానికి
తరపు బంధువులూ, మిత్రులూ, వస్తూపోతుంటారు.
దులో ఆడవాళ్ళూ, మగవాళ్ళూ కూడా వుంటారు.
ళ్ళు రావడానికీ, పోవడానికీ మేమేమీ ఆంక్షలు పెట్ట
ము. కారణం, ఇక్కడ చేరేవాళ్ళంతా గౌరవనీయ
టుంబాలకి చెందిన వాళ్ళు కనక!

పవిత్రని కలుసుకోడానికి రోజూ ఓ యువకుడు వస్తుండే
ాడు. ఇద్దరూ గంటలతరబడి గదిలో కూర్చుని మాట్లాడు
నేవారు. అత నెవ్వరు? నీ కేమౌతాడు? ఎందుకు వస్తాడు?
లాంటివేమీ నేనడగలేదు. ఆమె నే కాదు, మేమెవ్వర్నీ
అటువంటి తేలిక ప్రశ్నలు వెయ్యం. ఎందుకంటే, ఇక్క
ఉండేవారిమీద మాకు పూర్తిగా విశ్వాసం వుంటుంది.

ఒక్కోసారి పవిత్ర అతని వెంట వెళ్ళి చీకటిపడ్డాక, చాలా ఆలస్యంగా తిరిగి వచ్చేది. ఐనా, మేము పట్టించుకో లేదు. కానీ, కొద్ది రోజుల తరవాత ఒకరిద్దరు స్త్రీలు పవిత్రమీద నాకు కంప్లైంట్ ఇచ్చేరు.''

''ఏమని?'' అడిగింది కౌసల్యాదేవి దడదడలాడే గుండెతో.

''ఆ యువకుడు పవిత్రకోసం రావడమే కాదు, ఒకటి రెండు సార్లు రాత్రంతా ఆమె గదిలోనే గడిపేడుట. పవిత్ర క్యారెక్టర్ మీద తమకేదో అనుమానం ఉందనీ, అటువంటి అసభ్యకర సంఘటనలు ఇక్కడ జరగడానికి వీల్లేదనీ, దీనివల్ల గెస్ట్‌హౌస్ పరువు ప్రతిష్టలు దెబ్బతింటా యనీ ఆ కంప్లైంట్‌లోని సారాంశం!

దాంతో నేను పవిత్రని పిలిచి అడిగేను ఇది నిజమేనా అని. నిజమేననీ, తామిద్దరూ ప్రేమించుకున్నారనీ, త్వరలో పెళ్ళిజేసుకోబోతున్నారనీ, తానిక్కడుండటం మాకిష్టం లేకుంటే తక్షణం వెళ్ళిపోతాననీ నిర్మొహమాటంగా చెప్పి, అప్పటికప్పుడు మాకు రావలసిన డబ్బు బల్లమీద పడేసి, గది ఖాళీజేసి వెళ్ళిపోయింది..."

ప్రేమ మధురమైనదీ, తేనెకన్నా తియ్యనిదీ అంటారు. యవ్వనంలో తను ప్రేమ అటలంటే చాలా భయపడేది. ఏ ప్రేమలో హత్యలూ, ఖూనీలూ జరుగుతాయో, ఏ ప్రేమలో అపహరణలూ, మానభంగాలూ జరుగుతాయో, అందమైన మొహాలపై ఏసిడ్ చల్లి బ్రతుకంతా దుర్భరం జెయ్యబడుతుందో అటువంటి ప్రేమ మధురమైనదీ, తియ్యనిదీ ఎలా అవుతుంది?

ఆమె తిరిగి చెప్పసాగింది. "పవిత్ర జవాబు విని నాకు వళ్ళు మండిపోయిందంటే నమ్మండి. ఈనాటి యువతీ యువకులకి ఇదోజబ్బు. సరైన నిర్వచనం తెలియకపోయినా, 'ప్రేమ' అనే పదాన్ని అడ్డుపెట్టుకుని విచ్చలవిడిగా ప్రవర్తిస్తారు. ఇదేమిటని ఎవ్వరైనా నిలదీసి అడిగితే, ఏముంది–ప్రేమించుకున్నాం, పెళ్ళిజేసుకోబోతున్నాం అని నోరు నొక్కేస్తారు. పెళ్ళి జేసుకోబోతున్నవారు ఆ తంతు జరక్కముందే ఈ విపరీత చేష్టలేమిటి?

ప్రేమా, ప్రేమా అని దేవిర్లాడుతూ, ఆ యువకుణ్ణి గుడ్డిగా నమ్ముకున్న మీ కూతురు ఇప్పుడెక్కడుందో తెలుసా?"

"ఎక్కడుంది?"

"జైల్లో!!"

అకస్మాత్తుగా ఆ భవనం కూలిపోతున్నట్టూ, ఆ శిథిలాల్లో తను కూరుకుపోతున్నట్టూ భ్రాంతి కలిగింది కౌసల్యాదేవికి భూమీ, ఆకాశమూ తలకిందులౌతున్నట్టు తోచింది క్షణం పాటు.

ఇవేమీ పట్టనట్టు ఆమె తన ధోరణిలో చెప్పుకు పోతోంది... "ఒకసారి సెషన్స్ కోర్టులో మావాళ్ళ తాలూకు కేసొకటి నడుస్తోంటే చూద్దామని వెళ్ళాను. అక్కడ కనిపించింది పవిత్ర, పోలీస్ కస్టడీలో! మామూలు పవిత్ర కాదు, ఏడు నెలల గర్భిణి!

అదే రోజు, పోలీసులు ఆమెని కోర్టులో హాజరు పరుస్తున్నారుట. అప్పుడు తెలిసింది అసలు కథ!

ఆ నీచుడు పవిత్రని నమ్మించి మోసం చేసేడు. అన్నీ దోచుకుని చివరికి ద్రోహం చేసేడు. ఫలితంగా పవిత్ర నెల తప్పింది. త్వరగా పెళ్ళిజేసుకుందామని అతని కాళ్ళ వేళ్ళా పడిందట. ఇప్పుడూ, అప్పుడూ అని దాటవేస్తూ కొన్నాళ్ళు ఆమెని తనదగ్గరే వుంచుకున్నాడుట.

ఒక రోజు అతను ఇంట్లో లేని సమయంలో, అతని పేర వచ్చిన ఉత్తరాన్ని పవిత్ర చూడటం తటస్థించింది. అప్పుడు బైటపడింది అతని అసలు రంగు! బాల్యంలోనే ఆ యువకుడికి వివాహం జరిగిపోయిందిట.

ఊరికి వచ్చి, పిల్లని కాపరానికి తీసికెళ్ళమని అతని మేనమామ రాసిన ఉత్తరం అది. వాళ్ళు బాగా ఆస్తిపరులట. ఒక్కతే కూతురు. ఆ ఒక్క కూతుర్ని ఈ మహానుభావుడికిచ్చి చేసేరుట.

కన్నూ మిన్నూ గానక, ఆ నీచుణ్ణి గుడ్డిగా ఆరాధిస్తూ తను ఎంత మోసపోయిందో అప్పుడు తెలిసివచ్చింది

పవిత్రకి. పెళ్ళిచేసుకోమంటే ఇన్నాళ్ళూ అతను ఎందుకు దాటవేస్తున్నాడో అర్థమయింది.

ఇంటికి రాగానే నిలదీసి అడిగిందిట అతన్ని. మొదట తెల్లబోయినా తరవాత అన్నీ ఒప్పుకున్నాడుట. ఇప్పుడు తన గతేమిటని అడిగితే ఏముందీ - రహస్యంగా ఎబార్షన్ చేయించుకుని ఏమీ జరగనట్టు జీవిస్తే సరి అన్నాడట!

ఆడది మనసి స్త్రీ హృదయాన్ని చిలికి అమృతాన్ని అందిస్తుంది. అదే అమృత హృదయంలో ద్వేషాగ్ని గనక రగిలిందంటే, మగవాడిపట్ల అది కాలకూట విషమే అవుతుంది.

సరిగ్గా అదే జరిగింది. ఆ రాత్రి ఇద్దరిమధ్యా పెద్ద ఘర్షణ జరిగింది. అతను ఉద్రేకంలో ఆమెమీద చెయ్యి కూడా చేసుకుని, ఇంట్లోంచి బైటకి గెంటడానికి ప్రయత్నించేడుట. పరిస్థితి పరాకాష్ఠనందుకునే సరికి, పవిత్ర ఆ అవమానం భరించలేక ఒళ్ళు తెలీని ఉద్రేకంలో చేతికందిన ఇనపవస్తువుతో అతని తల పగలగొట్టిందిట.

ఇరుగూ పొరుగూ మూగేరు. అతన్ని హాస్పిటల్ చేర్చేరు. దెబ్బ తగలనిచోట తగిలి వుంటుంది. తెల్లవారే లోగా అంతిమ శ్వాస వదిలేడు. పోలీసులు పవిత్రని అరెస్టు జేసి కేసుపెట్టేరు. కేసు చాలా రోజులు నడిచింది"

ఆమె ఇంకా ఏమంటోందో కౌసల్యాదేవికి వినిపించడంలేదు. కళ్ళల్లో చీకట్లు కమ్ముకోసాగేయి. తల గిరగిర తిరగసాగింది. చూస్తూ చూస్తూనే తల పక్కకి వాల్చి స్పృహ తప్పింది. ఆవిడ ఖంగారుగా లేచి ఆమెదగ్గరికి పరిగెత్తింది.

7

తిరిగి కళ్ళు తెరిచిన కౌసల్యాదేవి, తను మంచంమీద పడున్నట్టు గ్రహించింది. మంచం చుట్టూ అక్కడి ఆడ

వాళ్ళు నిల్చుని చూస్తున్నారు.

ఇప్పుడు కౌసల్యాదేవి గుండెమీద ఏదో రాయి పెట్టి నట్టు ఉంది. ఏమీ జరగనట్టే లేచి కూర్చోబోయింది.

"లేవకండి. కాసేపు అలాగే పడుకుని విశ్రాంతి తీసుకోండి." అంది ఆమె వారిస్తూ.

"ఇప్పుడు నాకేం ఫరవాలేదు. బాగానే వున్నాను. ఇంతకీ, ఇప్పుడు పవిత్ర ఎక్కడుంది?" అడిగింది లేచి కూర్చుంటూ.

"చెబుతాను. మీరు పూర్తిగా ఎక్సైట్‌మెంట్‌కి గురి అవుతున్నారు. తట్టుకోవాలి. ఇది జీవితం. అనుకోనివెన్నో జరుగుతూ పోతుంటాయి" అంటూ అక్కడ నిల్చున్న వాళ్ళను వెళ్ళిపొమ్మన్నట్టు సైగజేసి నెమ్మదిగా చెప్ప సాగింది ఆమె.

"నాకు బాగా తెలిసిన అమ్మాయి గనుక, ఆ కేసు ఎలా ముగుస్తుందో కనుక్కోవాలన్న జిజ్ఞాస ఉండేది నాకు. ఓ లాయర్ ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకునే దాన్ని... కేసు ఇంకా ముగియకముందే, జడ్జి తీర్పు చెప్పక ముందే, జైలు ఆస్పత్రిలో పవిత్ర ప్రసవించిందిట..."

"పిల్లా? పిల్లాడా?"

"ఆడపిల్ల!"

"పవిత్ర ఎలా వుంది?"

"నెలలు నిండిన కాన్పు! చాలా కష్టంగా వచ్చిందిట. ఫోర్సెప్స్ వేసి పిల్లని బైటికి తీసేరుట... క్షమించండి... పవిత్ర ప్రసవంలో పోయింది..."

ఎంత ఆపుకుందామన్నా కౌసల్యాదేవికి దుఃఖం ఆగ లేదు. పసిపిల్లలా వెక్కి వెక్కి ఏడవసాగింది. ఆమె ఓదారు

స్తున్నకొద్దీ ఆ దుఃఖం ఆగకపోగా, ఇంకా ఎక్కువయింది. ఒక్కగానొక్క కూతురు. ఎన్ని ఆశలు పెట్టుకుంది దానిమీద. ఎన్ని కలలుగంది. అయ్యో తల్లీ, పాపిష్టి ప్రేమలో పడి దిక్కు మొక్కు లేక ఆరిపోయేవా? అంటూ ఆక్రోషించింది ఆ వృద్ధ హృదయం.

"మీరు వచ్చి, పవిత్రగురించి అడిగేసరికి, ఇవన్నీ చెప్పాలా వద్దా అని ముందు సందేహించేను. ఎలాగూ చెప్పక తప్పదు కదా అని చెప్పేసేను. పవిత్రేకాదు, పెద్దల కట్టుబాట్లనీ, నిర్ణయాలనీ ధిక్కరించి, గుడ్డిప్రేమలో పడి ఎంతోమంది యువతులు బంగారంలాటి జీవితాలని నేలపాలు చేసుకుంటున్నారు. అలాగని, ప్రేమ వివాహాలకి నేను వ్యతిరేకిని కాను..."

ఏడ్చి ఏడ్చి కాసేపటికి తెప్పరిల్లింది కౌసల్యాదేవి. పైటతో కళ్ళు తుడుచుకుని "పవిత్ర కన్న పాప ఇప్పు డెక్కడుంది?" అడిగింది.

"కేవలం వారం రోజుల క్రితం మాట ఇది...ఆ పాప జైలు ఆస్పత్రిలో, అధికార్ల ఆధీనంలో వుందో, మరెక్క డుందో చెప్పలేను. ఆడవాళ్ళ జైలుకెళ్ళి కనుక్కుంటే ఏమైనా తెలియవచ్చు!"

"నా బిడ్డ ఈ లోకంనించి నిష్క్రమించిందన్న సత్యాన్ని వినకముందే నా ప్రాణం పోవలసింది. భగవంతుడు ఆ దిక్కులేని పసికందును చూసుకోమని కాబోలు ఇంకా నాలో ఊపిరి ఆడిస్తున్నాడు. నన్నక్కడికి తీసికెళ్ళి అధికార్లతో మాట్లాడేందుకు సహాయపడతావా అమ్మా?" అంది కౌసల్యాదేవి దీనంగా.

ఆమె తలూపి "తప్పకుండా!" అంది ధైర్యం చెబుతో.

టాక్సీలో జైలుదేరేరు ఇద్దరూ.

ఆ బిడ్డని ఎవ్వరికి అప్పగిద్దామా వదుల్చుకుందామా అని ఆలోచిస్తున్న జైలు అధికార్లకి, వాళ్ళంతట వాళ్ళే వెదుక్కుంటూ రావడంతో పెద్ద భారం దిగిపోయినట్లు తోచింది. పవిత్ర చివరివరకూ తన వ్యక్తిగత వివరాలు చెప్పడానికి నిరాకరించిందిట.

జైలర్ వాళ్ళని వెంటబెట్టుకుని, జైలు ఆస్పత్రికి తీసికెళ్ళి లేడీ డాక్టర్‌కి పరిచయం చేసేడు.

నర్సు వాళ్ళని వార్డులో ఓమూల ఉన్న ఉయ్యాల దగ్గరికి తీసికెళ్ళి చూపించింది.

పిడికిళ్ళుమూసి, నిశ్చింతగా నిద్రిస్తోంది పసిబిడ్డ.

కౌసల్యాదేవి చేతులు ఆగలేదు. అప్రయత్నంగా పసిదాన్ని ఎత్తుకున్నాయి.

అంతా పవిత్ర పోలికే!

లిప్తపాటు కౌసల్యాదేవి కళ్ళల్లో ఒకనాటి తన ప్రసవ ఘడియలూ, ఆ ప్రసవంలో పుట్టిన పవిత్రా కదలాడేయి. కాళ్ళూ చేతులూ తన్నుకుంటూ పైటచాటున పాలిండ్లకోసం అన్వేషిస్తూ ఎంత మారాంచేసేది చిట్టితల్లి. ఆ పవిత్ర ప్రతిరూపమేనా ఇది? ఏమిటీ మాయాజాలం?

రాతలూ కోతలూ సంతకాలూ అవీ అయ్యేక పాపను కౌసల్యాదేవి కప్పగించేరు అధికార్లు. చల్లగాలి తగలకుండా పాప ఒంటినిండా బట్టకప్పుతూ హాస్పిటల్లోంచి బైటికి వచ్చింది.

అప్పుడే, ఆ పసిది కళ్ళుతెరిచి, కాళ్ళూ చేతులూ తన్నుకుంటూ రెప్పవెయ్యకుండా ఆమెవైపు చూడసాగింది.

సజల నయనాలతో మెట్లు దిగసాగింది కౌసల్యాదేవి.

—: ఐ పో యిం ది :—